# అఖిలభారత ప్రజాసాహిత్య, కళాసాంస్కృతిక సభలు

## 2025 జనవరి 31, ఫిబ్రవరి 1, 2 తేదీలు

## వేదిక : ఎన్జీవో కళ్యాణమండపం, మెడికల్ కాలేజ్ రోడ్డు, గుంటూరు

**నేడు** దేశంలో నెలకొని ఉన్న ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో ప్రజాసాహిత్య, సాంస్కృతిక కళారంగాలు నిర్వర్తించవలసిన కర్తవ్యాలను, ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించి నూతన ప్రజాతంత్ర సంస్కృతి నిర్మాణానికై అఖిలభారత ప్రజాసాహిత్య సాంస్కృతిక వేదిక గుంటూరులో ఈ సభలను నిర్వహిస్తోంది.

సాహిత్య సాంస్కృతిక రంగాలలో కృషి చేస్తున్న వివిధ రాష్ట్రాల సంఘాల సభ్యులు ఈ సభలలో పాల్గొంటారు.

మన ఆనందాన్ని, విషాదాన్ని; కష్టాలను, కన్నీళ్లను; ఆగ్రహాన్ని, భావోద్వేగాన్ని; అభిప్రాయాలను కళలు, సాహిత్యం ప్రతిబింబిస్తాయి. మరణశయ్య పైనున్న అభివృద్ధి నిరోధక సామాజిక శక్తులకు ఊపిరి పోసే సాహిత్యము, కళలు గతం నుండి కొనసాగుతున్నాయి. ఆధునిక యుగంలో నూతన ప్రగతిశీల సాంస్కృతిక శక్తులను బలోపేతం చేసే సాహిత్యం కళలను స్వీకరించటం, అనుసరించటం, పెంపొందించడం మన కర్తవ్యం.

ప్రపంచీకరణ విధానాలతో ధ్వంసం అవుతున్న ప్రజల సామాజిక జీవితం, సాంస్కృతిక జీవనం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వస్తు వ్యామోహ సంస్కృతిని పెంపొందించడం ద్వారా తమ లాభాలను పెంచుకునే సామ్రాజ్యవాదులు, బడాపెట్టుబడిదారులు, ప్రజల ఆలోచనలను, వారి మూలాలను, వారి శ్రమ సంస్కృతిని సమూలంగా నాశనం చేస్తున్నారు. సెల్‌ఫోనులు, టీవీలు, ఇంటర్నెట్ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావటం ద్వారా వాటిని సక్రమంగా వాడటం కాక వాటి ద్వారా సమష్టితత్త్వం స్థానంలో వ్యక్తివాదతత్త్వాన్ని ప్రబలం చేస్తున్నారు. వివిధ సాంస్కృతిక రూపాలలో మూఢవిశ్వాసాలను, కుల, మతతత్త్వాలను, పితృస్వామిక భావజాలాన్ని పెంచి పోషిస్తున్నారు. అశేష ప్రజానీకపు జీవితాలు ఈనాడు తీరని వెతలతో, అభద్రతతో, అశాంతితో, నిరాశతో సాగుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో సాహిత్య కళారంగాల సంస్థలు ప్రజల ఆలోచనలను చైతన్యవంతం చేస్తూ వారిని కార్యాచరణకు పురికొల్పే కర్తవ్యాలను చేబూనాలి. వలస పాలన కాలం నాడు, స్వాతంత్ర్యోద్యమ కాలంలోనూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ సాహిత్య కళారంగాలు, అప్పటి ఉద్యమాలకు అండదండలు అందించాయి. ఫ్యూడల్ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక సంస్కృతి కోసం సాగిన సమస్త ఉద్యమాలకు ప్రజాసాహిత్యమూ కళలూ తోడ్పడ్డాయి. ఆనాడు ప్రపంచవ్యాప్తంగా ఫాసిజానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యాలతో సాగిన ఉద్యమాల, విప్లవోద్యమాల ప్రభావంతో మనదేశంలోనూ ప్రజాసాహిత్య కళారంగాలు కృషి చేశాయి. ఆ ప్రజాసాహిత్య కళారంగాల అనుభవాల వెలుగులో మతతత్త్వ ఫాసిస్టు నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా నూతన ప్రజాతంత్ర సంస్కృతిని నిర్మించుకోవటానికి వివిధ రాష్ట్రాల్లోని సాహిత్య కళారంగాల సంస్థలు కలిసి ఈ సభలను నిర్వహిస్తున్నాయి.

ఈ సభలో పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, బీహార్, ఒరిస్సా, ఢిల్లీ, జార్ఖండ్, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తదితర రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొంటారు.

జనవరి 31న సాహిత్య సభ జరుగుతుంది. ఫిబ్రవరి 1, 2 తేదీలలో విభిన్న ప్రక్రియల్లో పలు రాష్ట్రాల కళాసాంస్కృతిక ప్రదర్శనలు, ప్రసంగాలు ఉంటాయి. ప్రజలు, సాహిత్య కళాభిమానులు విరివిగా పాల్గొని, ఆర్థికంగా సహకరించి సభలను విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**కొత్తపల్లి రవిబాబు,**

**30-12-2024** ప్రధాన కార్యదర్శి

**అఖిల భారత ప్రజాసాహిత్య సాంస్కృతిక వేదిక**

All India People's Literary and Cultural Forum (AIPLCF)